

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

## పాఠశాల పనులను పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, జూన్ 19: గురుకుల పాఠశాలను త్వరితగతిన పూర్తి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని భవానీనగర్ సోషల్ వెల్ఫేర్ పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి, పాఠశాలలో మిగిలిన మైనర్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులను పాఠశాలలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

## జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పరామర్శ



లక్ష్మారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దావ వసంత

మేడిపల్లి, జూన్ 19 : భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీపాల్‌రెడ్డిని సోమవారం జడ్పీ చైర్మన్ దావ వసంత పరామర్శించారు. ఆమె వెంట సర్పంచ్ కాటిపెల్లి జగన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కానుగంటి శ్రీనివాస్, రైతు బంధు సమితి జగిత్యాల మండలాధ్యక్షుడు నక్క రవీందర్‌రెడ్డి, నాయకులు సుధవేని భూమేశ్‌గౌడ్, నాంచారి రాజేందర్, దుర్శెట్టి లక్ష్మణ్‌కుమార్, నజీర్, బంగారు దీపక్ తదితరులున్నారు.

## మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కృతజ్ఞతలు

ధర్మపురి, జూన్ 19: ధర్మపురి మండలం బూరుగుపల్లి ఆంజనేయ స్వామివారి దేవాలయానికి ధూపదీప నైవేద్యం పథకం వర్తింపజేయడంపై మంత్రి ఈశ్వర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో బూరుగుపల్లి సర్పంచ్ కంది తిరుపతి, అర్చకుడు శ్రీధర్‌స్వామి, గ్రామస్తులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

ఇబ్రహీంపట్నం, జూన్ 19: తహసీల్దార్‌గా రవికిరణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ మహేశ్వర్ ఆర్డీవోగా పదోన్నతిపై వెళ్లగా కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న రవికిరణ్ కుమార్ ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా రెవెన్యూ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగకు రెండేండ్ల జైలు శిక్ష

రాయికల్, జూన్ 19: ఇటిక్యాల, మైతాపూర్ గ్రామాల్లో చోరీలకు పాల్పడ్డ దొంగ పండరి బాలు పవార్‌కు రెండు సంవత్సరాల ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జితేందర్ సోమవారం తీర్పునిచ్చినట్లు రాయికల్ ఎస్‌ఐ అజయ్ తెలిపారు. పండరి బాలు గతంలో ఇటిక్యాల, మైతాపూర్ గ్రామాల్లో పలు ఇండ్లలో చోరీలకు పాల్పడగా, అప్పటి ఎస్‌ఐ ఆరోగ్యం కేసు నమోదు చేసి విచారణ అనంతరం అరెస్ట్ చేశారు. పండరి బాబు చోరీ చేసినట్లుగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీ రాజేశ్ వాదనలు వినిపించి నేరాన్ని రుజువు చేయడంతో నిందితుడికి రెండు సంవత్సరాల ఏడు రోజుల జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ వివరించారు.

## కోరుట్ల వాసికి స్వర్ణ నంది అవార్డు

కోరుట్ల రూరల్, జూన్ 19: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శ్రీ శాంతికృష్ణ సేవా సమితి, బీఎం బిర్లా సైన్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని భాస్కర్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక మహోత్సవాల్లో భాగంగా కోరుట్ల పట్టణానికి చెందిన ముంబయి ఆంధ్ర మహాసభ అధ్యక్షుడు సంకు సుధాకర్‌కు స్వర్ణ నంది అవార్డును అందజేశారు. సుధాకర్ చేసిన సేవలను గుర్తించి మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న సుధాకర్‌ను పలువురు అభినందించారు.

# భావితరాలకు వృక్ష సంపదను అందించాలి

- అడిషనల్ కలెక్టర్ మంద మకరంద
- ఇబ్రహీంపట్నంలో హరితోత్సవానికి హాజరు



మొక్కలు నాటుతున్న అడిషనల్ కలెక్టర్ మకరంద, ప్రజాప్రతినిధులు, అధికారులు

ఇబ్రహీంపట్నం, జూన్ 19: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి భావితరాలకు వృక్ష సంపదను అందించాలని అడిషనల్ కలెక్టర్ మంద మకరంద అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో హరితోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు ఆస్తులు పంచడం కన్నా స్వచ్ఛమైన గాలి, నివాస యోగ్యమైన పచ్చని ప్రకృతి వనాలను అందించాలన్నారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటికి నీరు అందించి సంరక్షించాలని కోరారు. అనంతరం ఇబ్రహీంపట్నం క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతున్న ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారితో కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో పీడీ లక్ష్మీనారాయణ, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఏపీడీ బాలె శివాజీ, ఎంపీడీవో ప్రభు, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు నేమూరి లత, ఏపీఎం శంకర్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు నేమూరి సత్యనారాయణ, జాజాల జగన్ రావు, రాంరెడ్డి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## కోరుట్లలో 'మన ఇంటికీ మన సంజయన్న'



మహిళ తో మాట్లాడుతున్న సంజయ్

కోరుట్ల రూరల్, జూన్ 19: కోరుట్ల పట్టణంలోని 12వ వార్డులో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మన ఇంటికీ మన సంజయన్న కార్యక్రమంలో భాగంగా వార్డులోని ఇంటింటా తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆత్మీయంగా పలుకరించి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వృద్ధులు, మహిళలు, బీడీ కార్మికులతో కలిసి కాసేపు ముచ్చటించారు. ఆసరా పింఛన్లు అందుతున్నాయా.? ఇతర ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని, ప్రజలు సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష ఆర్థిక సాయం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీద పవన్, నాయకులు బర్ల ప్రభాకర్, నాగరాజు, బీఆర్‌ఎస్ యూత్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న సెక్యూరిటీ గార్డు



సీఐకి నగదును అందజేస్తున్న రహమాన్

మెట్‌పల్లి, జూన్ 19: పట్టణంలోని వేంపేటలో రోడ్డులో ఓ ఏటీఎం మిషన్‌లో నుంచి డ్రా అయిన రూ.10 వేల నగదును స్థానిక సీఐ లక్ష్మీనారాయణకు మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల విద్యాలయంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఎండీ రహమాన్ అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. సోమవారం రహమాన్ తన ఖాతాలోని డబ్బులను డ్రా చేసుకునేందుకు ఏటీఎంకు వెళ్లాడు. మిషన్‌లో కార్డు పెట్టాడో లేదో ఫిన్ నంబర్, మరే ఇతర వివరాలు నమోదు చేయకుండానే డబ్బులు వచ్చాయి. అవి తనవి కావని గుర్తించి వెంటనే తన స్నేహితుడితో కలిసి సర్కిల్ కార్యాలయానికి వెళ్లి సీఐకి అందజేశాడు. ఏటీఎంలో మరో ఖాతాదారు డబ్బులు అని తెలిసి తిరిగి ఇచ్చి తన నిజాయితీని చాటుకున్న రహమాన్‌ను సీఐ అభినందించారు. అనంతరం ఆ డబ్బులను ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌కు సెక్యూరిటీ ద్వారా అప్పగించారు.

## మెట్లచిట్టాపూర్‌కు హరితహారం అవార్డు



సర్పంచ్, కార్యదర్శిని సన్మానించి ఉత్తమ సేవా పత్రాన్ని అందజేస్తున్న మంత్రులు

మెట్‌పల్లి రూరల్, జూన్ 19: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామపంచాయతీకి హరితహారం అవార్డు లభించింది. హరితహారంలో భాగంగా పచ్చదనం పెంపునకు విశేష కృషి చేసినందుకు జిల్లా నుంచి మెట్లచిట్టాపూర్ గ్రామపంచాయతీ ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికైంది. ఈమేరకు తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం జరిగిన హరితోత్సవం కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, హోంమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా సర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దివ్య ఉత్తమ సేవా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, కార్యదర్శిని మంత్రులు ఘనంగా సన్మానించారు.

## పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి : డీఈవో

జగిత్యాల టౌన్, జూన్ 19: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఘనంగా జరుపుకోవాలని జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ఉదయం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరే విధంగా చూడాలని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. దశాబ్ది ఉత్సవాల గురించి, పాఠశాల విద్యా ప్రగతి గురించి, 10 సంవత్సరాల రాష్ట్ర విద్యా ప్రగతి గురించి, తెలంగాణ సాహితీవేత్తల గురించి వారందరితో చర్చించాలన్నారు. అలాగే పాఠశాల స్థాయిలో క్విజ్, డ్యాన్స్, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులందరికీ బహుమతులు అందజేయాలన్నారు. పాఠశాలలను అందంగా అలంకరించి తెలంగాణ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో జిల్లా స్థాయి తెలంగాణ విద్యా దినోత్సవం జరుగుతుందని తెలిపారు.

## సమస్యను పరిష్కరించాలని ఆందోళన

మెట్‌పల్లి, జూన్ 19 : మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్, రామలచ్చక్కపేట గ్రామాల నడుమ ఎస్సారెస్పీ వరద కాల్వ సరిహద్దు వివాదం కొనసాగుతున్నది. వరద కాల్వకు సంబంధించి శాశ్వత పరిష్కారం కోసం జగ్గాసాగర్ గ్రామస్తులు సోమవారం ర్యాలీకి మెట్‌పల్లి పట్టణానికి చేరుకున్నారు. పాత బస్టాండ్ వద్ద 63వ జాతీయ రహదారిపై బైఠాయించారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగడంతో రెండువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక సీఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ శ్యామ్‌రాజ్ జోక్యం చేసుకొని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఎవరైనా అధికారి వస్తేనే తమ రాస్తారోకోను విరమిస్తామని చెప్పడంతో పోలీసులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌మహ్మద్ అక్కడికి చేరుకొని వినతి పత్రం తీసుకోవడంతో బైఠాయింపును విరమించారు. అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో అందజేశారు.

## యూట్యూబ్ ఛానల్ ప్రారంభం

పెగడపల్లి, జూన్ 19: మండలకేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మై విలేజ్ నవ్వులు యూ ట్యూబ్ ఛానెల్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నేత, సహకార సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావు, సర్పంచ్ మేర్గు శ్రీనివాస్ ప్రారంభించారు. ఇక్కడ ఆలయ కమిటీ అధ్యక్షుడు భూమాడి గంగారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, ఆరవల్లి సర్పంచ్ ఉప్పులంచ లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ మడిగెల తిరుపతి, కాంట్రాక్టర్ నాగిరెడ్డి, సిటీ కేబుల్ యజమాని పాశం మల్లారెడ్డి, ఆర్‌ఆర్ ఫ్యాన్స్ సభ్యులు తోట మహేందర్, రాజుగౌడ్, అరవింద్, శేఖర్ ఉన్నారు.

## ప్లే స్కూల్ ప్రారంభం

కోరుట్ల రూరల్, జూన్ 19: కోరుట్ల పట్టణంలోని ఝాన్సీ రోడ్డులో ఏర్పాటు చేసిన లిటిల్ ఫ్లవర్ ప్లే స్కూల్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ఆటాపాటలతో నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దిలీప్ రావు, మాజీ ఎంపీపీ తుమ్మనపెల్లి భారతి, పాఠశాల కరస్పాండెంట్ తుమ్మనపెల్లి సత్యనారాయణ, నాయకులు తుమ్మనపెల్లి చంద్రప్రకాశ్, ప్రిన్సిపాల్ సిరికొండ గంగాధర్, తుమ్మనపెల్లి మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.